క్లుప్తంగా

అలరించిన భక్త రామదాసు కీర్తనలు



పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీరామ పునర్వసు రాగ నీరాజనం, భారతీ సంగీత నిలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం శ్రీ భద్రాచల రామదాసు జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. అనఘా హైమా, వైణిక విద్వన్మణి, వీణా విశారద ఎ. భారతీదేవి బృందం శ్రీ భక్త రామదాసు కీర్తనలు ఆలపించి అలరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ గోపాల్ దంపతులు, డాక్టర్ కోగంటి వేంకట శ్రీ రంగనాయకి, గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి, త్యాగరాజ సాంస్కృతిక సంఘం సలహాదారులు నేతి విశ్వేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి

నెహ్రూనగర్: భారత కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట తలపెట్టినున్న ధర్నా జయప్రదం చేయాలని క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు రాయపాటి మరియదాసు కోరారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ చిత్రాన్ని కరెన్సీ నోటుపై ముద్రించాలని గత 13 సంవత్సరాల నుంచి పోరాడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రిజర్వు బ్యాంక్ స్థాపన, జాతీయకరణలో అంబేడ్కర్ కృషిని దృష్టిలో ఉంచుకుని ఆయనకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. రాజకీయ పార్టీలన్నీ కూడా అంబేడ్కర్ చిత్రాన్ని భారత కరెన్సీపై ముద్రించాలని మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. సమావేశంలో దళిత, క్రైస్తవ సంఘాల నాయకులు రాయపూడి చిన్నరాజు, దారా వెంకటరత్నం పాల్గొన్నారు.

కేజీ బేసిన్‌లో హక్కులపై ఉద్యమం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



లక్ష్మీపురం: కృష్ణా, గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో పాటు చమురు ఉత్పత్తిపై వచ్చే లాభాల్లో ఏపీకి వాటా ఇవ్వాలని రాజకీయాలకతీతంగా ఉద్యమం జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సభకు అవధానుల హరి అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర తీరంలో చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక స్వరూపాన్ని మార్చబోతున్నా, ఏపీకి ఎలాంటి ఉపయోగం ఉండటం లేదని తెలిపారు. ప్రపంచంలో అన్ని చోట్ల అమలవుతున్న సహజ న్యాయ సూత్రం ఏపీ విషయంలో ఉల్లంఘిచడం సరైన పద్ధతి కాదన్నారు. అందుకు రాష్ట్ర ప్రజలందరూ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. మేధావుల ఫోరం కార్యదర్శి చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అండతో ఏపీలోని సహజవనరులు రిలయన్స్ పాలవుతున్నాయని తెలిపారు. మన అవసరాలు తీరకుండానే 1500 కిలోమీటర్ల దూరాన ఉన్న గుజరాత్, మహారాష్ట్రకు మన తీరం నుంచి గ్యాస్‌ను తరలిస్తున్నారని చెప్పారు. సభలో సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కేజీ బేసిన్ సాధన సమితి కన్వీనర్ రాజమోహన్, మల్లికార్జునరావు, మూర్తి పాల్గొన్నారు.

కన్నెగంటి సేవలు అసమానం



కన్నెగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఎస్పీ చక్రపాణి, డాక్టర్ మండవ

గుంటూరు వెస్ట్: స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచిత పోరాటం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన కన్నెగంటి హనుమంతు సేవలు అసమానమని విశ్రాంత ఎస్పీ చక్రపాణి కొనియాడారు. స్థానిక గుజ్జనగుండ్లలో గురువారం ఏపీ కన్నెగంటి హనుమంతు మెమోరియల్ స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన 102 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ పశువులు తినే గడ్డిపైనా, మేకలు తినే దాణా పైనా బ్రిటిషర్లు పన్నులు వేసి ప్రజల్ని ఇబ్బంది పెడితే దానికి వ్యతిరేకంగా కన్నెగంటి హనుమంతు పోరాడి విజయం సాధించారని తెలిపారు. డాక్టర్ మండల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలమే మనం అనుభవిస్తున్న స్వరాజ్యమన్నారు. కన్నెగంటి లాంటి మహనీయులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది కార్యక్రమాలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యుల్ని అభినందించారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి నాగరాజు, సీహెచ్. సురేష్, చిమటా నాగరాజు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్

- మేయర్ కావటి
- నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ రూపకల్పనపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమావేశమైన నగర మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ తయారు చేసే బడ్జెట్ గుంటూరు నగరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ 2024–25 వార్షిక బడ్జెట్‌పై మేయర్ అధ్యక్షతన గురువారం ఆయన చాంబర్‌లో ఆదాయ, వ్యయాలు, బడ్జెట్ రూపకల్పన, అంచనాలపై విభాగాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పాటుపడుతున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ ఆదాయం పెంపుదలకు, కొత్త ఆదాయ మార్గాల అన్వేషణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నగర పాలక సంస్థకు వచ్చే ఆదాయంలో అధిక భాగం ఆస్తి పన్ను వసూళ్ల ద్వారా వస్తోందని పేర్కొన్నారు. నగర పాలక సంస్థకు వచ్చే ఆదాయాలు, చేసే వ్యయాలతో వాస్తవిక అంచనాలతో అభివృద్ధే ప్రధాన అజెండాగా బడ్జెట్ ఉంటుందని వివరించారు. బడ్జెట్లో తాగునీరు, పారిశుద్ధ్యంతో పాటు నగరంలో పచ్చదనం పెంపునకు, రోడ్ల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఈఓ ఎ. నాగేంద్ర కుమార్, ఈఈ సురేందర్‌రెడ్డి, సీపీ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదనరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

జగనన్న లేఔట్లలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఈ నెల 23వ తేదీలోగా నూరు శాతం పూర్తి చేయాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు నోడల్ అధికారుల్ని ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలుతగా సచివాలయాల వారీగా ఎన్ని రిజిస్ట్రేషన్‌లు పెండింగ్ ఉన్నదీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో 66 వేల మందికి ఇళ్ల పట్టాలని ఇచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే వాటిలో చాలావరకు రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయని, మిగిలిన వాటికి కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న కార్పొరేటర్ ఆచారి తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు పని చేస్తున్నారని పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొనియాడారు. 32వ డివిజన్ పరిధిలో బ్రాడీపేటలో 'వలంటీర్స్‌కి వందనం' గురువారం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజల ఇంటి వద్దకే వచ్చి నిస్వార్థంగా సేవల్ని అందిస్తున్న వలంటీర్లపై పలువురు స్వార్థ రాజకీయ నేతలు నీచమైన వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని ఖండించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ నేతలు వలివేటి వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థుల పారిశ్రామిక టూరు



సందర్శన యాత్రలో విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయిలో పారిశ్రామిక సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థుల కెరీర్‌లో పారిశ్రామిక సందర్శనకు ప్రాముఖ్యత ఉందన్నారు. కళాశాలలో బోధించే పాఠ్యాంశాల్లో ఇది ఒక భాగమని చెప్పారు. కంపెనీల వ్యాపార సూత్రాలతో పాటు అంతర్గత విషయాలను తెలుసుకునేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం తులసి గ్రూప్ సంస్థలను సందర్శించిన విద్యార్థులు, అధ్యాపక బృందం అక్కడ ఉత్పత్తి, ప్యాకేజింగ్, ప్రాసెసింగ్ తదితర విషయాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తిలకించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చల్లా వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, బి. అనిత, ఎన్. మణికంఠ పాల్గొన్నారు.

పానీ పూరీ బండ్ల నిర్వాహకులకు నోటీసులు



పానీపూరీ బండ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రజారోగ్యధికారులు

నెహ్రూనగర్: నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో పానీపూరీ బండ్ల నిర్వాహకులకు ప్రజారోగ్యధికారులు నోటీసులు జారీ చేశారు. నగరంలో ప్రస్తుత అనారోగ్యాలకు రోడ్ల పక్కన పానీపూరీ బండ్లు, తినుబండరాలు కూడా కారణం కావచ్చని రీజినల్ ల్యాబ్ నగరపాలక సంస్థకు సూచించిన నేపథ్యంలో పానీ పూరీ బండ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. తొలి విడతగా నోటీసులు జారీ చేశామని, త్వరలో స్పెషల్ యాక్షన్ ప్లాన్ ద్వారా అనారోగ్యకర వాతావరణంలో ఉండే పానీపూరీ బండ్లను తొలగిస్తామని అధికారులు చెప్పారు. ఇప్పటికే నగరంలో ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలు జరుపుతున్న ఆరు మినరల్ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయడంతో పాటు, మరో 56 ప్లాంట్‌లకు నోటీసులు జారీ చేశామన్నారు. నగర ప్రజలు తాగునీటిని నిర్దేశిత ప్రమాణాలు పాటించే ప్లాంట్స్‌లోనే కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు.

మహాప్రస్థానంలో వసతుల కల్పనకు విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: బొంగరాలబీడులోని మహాప్రస్థానంలో వసతుల కల్పనకు దారపనేని చెన్నకేశవులు, వెంకటరమణమ్మ దంపతులు రూ.లక్షా నూట పదహార్ల విరాళాన్ని గురువారం అందజేశారు. సంబంధిత మొత్తాన్ని చెక్కు రూపంలో కమిటీ సభ్యులకు దారపనేని చెన్నకేశవులు కుమారుడు హరికృష్ణ ప్రసాద్, వనజ, మనుమలు రామ్‌సాయి సారీన్, అక్షిత అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కల్లూరు రమణయ్య, కూనల మాల కొండయ్య, చల్లా తిరుపతయ్య, జంగాపల్లి పార్థసారథి, నిమ్మగడ్డ అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాపోరు ప్రారంభం



గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, పశ్చిమ నియోజకవర్గం నాలుగో మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మల్లికార్జునపేటలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానంలో నేతలు పూజలు నిర్వహించి ప్రజాపోరును ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజాపోరు జిల్లా కన్వీనర్ మకుటం శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి సుగుణ, పెద్దింటి కృష్ణ చైతన్య, పద్మనాభుని రమాదేవి, పాలపాటి రవికుమార్, బజరంగ్ రామకృష్ణ, బూసి స్టాలిన్, చరక కుమార్ గౌడ్, చేరుకూరి తిరుపతిరావు, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

షుగర్.. బీ కేర్‌ఫుల్

- వ్యాధి బారిన పడుతున్న పిల్లలు, యువత, పెద్దలు
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో ముప్పు నుంచి బయటపడే అవకాశం



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల నేడు పెద్దలతో పాటు చిన్నారులు, యువకులు కూడా షుగర్ వ్యాధి బారిన పడుతున్నారు. ఒకప్పుడు 40 ఏళ్లు దాటాక వచ్చేది. నేడు 20 ఏళ్లకే వ్యాధి బారిన పడటంపై వైద్య నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 50 మంది షుగర్‌వ్యాధి నిపుణులు, 120 మంది పిల్లల వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతినెలా ఒక్కో వైద్యుడి దగ్గరకు మూడు నుంచి ఐదుగురు పిల్లలు చికిత్స కోసం వస్తున్నారు.జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–1 కార్యక్రమంలో భాగంగా సర్వే చేయగా వివిధ వయస్సులకు చెందిన 5,41,123 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు పరీక్షల్లో తేలింది. ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాధికి కారణాలు

- మధుమేహం రావటానికి ప్రధాన కారణం ఇన్‌ఫెక్షన్లు. శరీరంలో ప్యాంక్రియాస్ గ్రంథి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇన్‌ఫెక్షన్ వల్ల అది దెబ్బతిని ఇన్సులిన్ ఉత్పత్తి అవ్వకపోవడంతో వ్యాధి సోకుతుంది.
- పుట్టుకతో వచ్చే జన్యుపరమైన కారణాలు, జంక్ ఫుడ్, వ్యాయామం లేకపోవడం, బరువు పెరగడం, స్థూలకాయం, మానసిక ఒత్తిడికి గురవ్వడం
- సరైన వేళల్లో భోజనం, నిద్ర లేకపోవడం, వైరస్ ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్ల అసమతుల్యత

వ్యాధి లక్షణాలు

- తరచూ మూత్ర విసర్జనతో పాటు ఎక్కువగా రావడం
- దాహం వేయడం, ఆకలి పెరగడం, బరువు తగ్గిపోవడం
- నీరసం, నిసత్తువ, కళ్లు మసకగా కనిపించడం
- పుండ్లు త్వరగా మానకపోవడం
- కాళ్ల తిమ్మిర్లు ఎక్కువగా ఉండటం,
- పిల్లలు రాత్రి వేళల్లో పక్క తడపడం
- మల విసర్జనతో ఇబ్బంది, వాంతులు చేసుకోవడం
- పెరుగుదల మందగించడం
- నిద్ర పోవడానికి ఇబ్బంది పడటం

జాగ్రత్తలతో షుగర్ కట్టడి



మధుమేహాన్ని జాగ్రత్తలతో రాకుండా నివారించవచ్చు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే తక్షణమే వైద్యుల్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయాలి. నిర్ణీత వేళకు పోషకాహారం, మితాహారం తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్‌ను, ఒత్తిడిని దరిచేరనీయవద్దు. కంటికి సరిపడా నిద్ర ఉండాలి. నూనె వస్తువులు, ఉప్పు తగ్గించి తీసుకోవాలి. స్వీట్లు, కూల్‌డ్రింక్స్, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ లాంటి షుగర్ ఎక్కువగా ఉండేవి తినకూడదు. ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ రేవూరి హరికృష్ణ, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

కిడ్నీలు పాడయ్యే ప్రమాదం



మధుమేహం అదుపులో లేకపోతే కిడ్నీలు దెబ్బతింటాయి. వాటి పనితీరు క్షీణిస్తున్న కొద్దీ క్రియాటిన్ పెరగడంతో పాటు రక్తపోటు అదుపులో ఉండదు. ప్రీ డయాబెటిస్ వారు అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరిచేరదు. బీపీ, షుగర్‌లతో కిడ్నీలతోపాటు హార్ట్ ఎటాక్ , బ్రెయిన్ స్ట్రోక్ వస్తోంది. కంటి చూపు కోల్పోతారు. శరీరంలోని ఇతర శరీర అవయవాలు దెబ్బతిని ప్రాణాపాయం సంభవిస్తుంది. ప్రతి ఒక్కరు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలి.

–డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్టు, గుంటూరు.

గుండెపోటుకు దారి తీసే అవకాశం



గుండె జబ్బులతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే వారిలో 50శాతం మంది మధుమేహ బాధితులే అధికంగా ఉంటున్నారు. వీరిలో రక్తనాళాలు బిరుసుగా మారి, స్పర్శ కోల్పోతారు. తద్వారా గుండెపోటుకు గురైనప్పటికీ నొప్పి తెలియదు. షుగర్ అదుపులో లేకపోతే గుండెపోటుతో పాటు బ్రెయిన్ స్ట్రోక్ కూడా వస్తుంది. బాధితులు ప్రతి ఏడాది తప్పనిసరిగా గుండె వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలి.

– డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

నలుగురికి సాయపడాలనే ఆలోచన గొప్పది

ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: నలుగురికి సహాయపడాలనే ఆలోచన ఎంతో గొప్పదని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో వరల్డ్ థింకింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ రాబర్ట్ బేడెన్ పోవెల్ జయంతి సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుండే సేవా దృక్పథం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మూడు జిల్లాల పరిధిలోని ప్రతి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ బృందాలినెలకొల్పేందుకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ థింకింగ్ డే ప్రాముఖ్యతతో పాటు బేడెన్ పోవెల్ జీవిత విశేషాలను, సేవలను స్కౌట్ ఉద్యమానికి అందించిన స్ఫూర్తిని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, స్కౌట్ మాస్టార్లు ఉప్పాల రామమోహనరావు, గంటా కిరణ్, ఈ.అనిల్‌కుమార్, ఎం.శ్రీహరి, షేక్ మీరా, గైడ్స్ కెప్టెన్ వరకమల కుమారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న విప్ అప్పిరెడ్డి, రవీంద్రనాథ్ తదితరులు

పట్నంబజారు: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతుల మిన్న అని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. పాత గుంటూరులోని పేద కుటుంబానికి చెందిన దేవులపల్లి లాస్య కంచిలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయంలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ల్యాప్‌టాప్ కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ చొరవ తీసుకుని రూ. 20వేలను విప్ అప్పిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని విప్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల్ని విద్యార్థుల కోసం అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దళిత, ఆదివాసి మేనిఫెస్టో విడుదల



ఏఎన్‌యూ: దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ (డీబీఆర్సీ) రూపొందించిన దళిత ఆదివాసి మేనిఫెస్టో 2024ను నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ పి. రాజశేఖర్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, ఆదివాసి స్థితిగతులపై అధ్యయనం చేయటం ఎంతో అభినందనీయమన్నారు. డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్ వి. భగవాన్ దాస్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 25 శాతంగా ఉన్న దళిత, ఆదివాసి ప్రజల ఆకాంక్షలకు అక్షర రూపంగా మేనిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. దళిత గిరిజనుల అభివృద్ధికి రాజకీయ పార్టీలు పొందుపరచవలసిన అంశాలైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, భూమి, ఇల్లు బడ్జెట్, సామాజిక భద్రతలకు సంబంధించిన విషయాలను మేనిఫెస్టోలో పొందుపరిచామని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కుమార్ రాజా పాల్గొన్నారు.

యువతలో సేవా భావం అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: యువతలో సేవా భావం ఎంతో అవసరమని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె. సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో కృష్ణబాబుకాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ వారం రోజుల శిబిరంలో భాగంగా మొక్కలు నాటడం, స్వచ్ఛతా సేవ, వైద్య శిబిరం, సరైన జీవన విధానం , పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జేవీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య సూచించారు. దేవస్థానం ప్రాంగణం వద్ద గురువారం తిరునాళ్ల ఏర్పాట్లపై జరిగిన సమీక్షా సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభల నిర్వాహకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగ రోజు దర్శనానికి వచ్చే భక్తులందరికీ త్వరితగతిన దైవ దర్శనం జరిగే విధంగా క్యూ లైన్లు ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖాధికారులకు సూచించారు. తిరునాళ్ల రోజు నారాకోడూరు – తెనాలి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు రాకుండా గతంలో లాగా ప్రత్యామ్నాయంగా నారాకోడూరు బైపాస్ రోడ్డు మార్గాన్ని ఉపయోగించాలని తెలిపారు. రహదారికి మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. మినీ బైపాస్ ద్వారా వాహనాల రాకపోకలు సాగించడం ద్వారా కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని చెప్పారు. దేవాలయం ప్రాంగణం వద్ద రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలు పెట్టకుండా ప్రత్యేకమైన స్థలంలో నిర్వహించుకోవాలని సూచించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్, అగ్నిమాపక శకటం అందుబాటులో ఉంచాలని తెలిపారు. మొబైల్ టాయిలెట్‌లను వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీ, తాగునీటి, విద్యుత్‌శాఖల అధికారులు చేపట్టనున్న పనుల గురించి సమావేశంలో వివరించారు. తిరునాళ్ల సందర్భంగా ఇప్పటి వరకు తీసుకున్న పనులు, చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ముందుగా బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. అనితారాణి, దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు, ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, కె. కిరణ్ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

T.V.N. వాసుదేవరావు అడ్వకేట్
విజయవాడ 22-02-2024

వైభవంగా శ్రీ వీరమ్మ పేరంటాళ్లు గ్రామోత్సవం

పెదకాకాని: శ్రీ వీరమ్మ పేరంటాళ్లు తిరునాళ్ల పురస్కరించుకుని గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 20న అమ్మవారు ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరింపబడిన ట్రాక్టర్‌పై బయలుదేరి తక్కెళ్లపాడు చేరుకుంది. అక్కడ గ్రామోత్సవం అనంతరం తిరిగి రాత్రికి వెనిగండ్లకు చేరుకుంది.